సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 23 । నవంబర్ । 2023



హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ
రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో గర్భిణుల్లో హైరిస్క్ తగ్గుతోంది.
-IIలో



వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు -IIలో
వేర్వేరు చోట్ల బుధవారం జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు.



కూరగాయల సాగు ప్రదర్శనా కేంద్రం ప్రారంభం -IIలో
వేపాడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కూరగాయల సాగు ప్రదర్శనా కేంద్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

26న రాజ్యాంగ దినోత్సవం

పార్వతీపురం: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఉత్సవంలో అధికారులు, ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

టీచర్‌గా మారిన పీఓ

- మల్లి గురుకుల విద్యార్థులకు పాఠ్యాంశ బోధన



విద్యార్థులకు బోధిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి మండలంలోని మల్లి గిరిజన గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పదోతరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి ముఖ్యమైన అంశాలను బోధించారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు పాల్గొన్నారు.

వనభోజనాలకు అటవీశాఖ పార్క్ సిద్ధం



కురుపాం మండలంలోని తెన్నుఖర్జ గ్రామ సమీపంలో వనభోజనాలకు సిద్ధంచేసిన అటవీశాఖ పార్క్

కురుపాం: కార్తీకమాసంలో వనభోజన ప్రియులు సందర్శించేందుకు, సేదతీరేందుకు వీలుగా మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తెన్నుఖర్జ గ్రామ సమీపంలో అటవీశాఖకు చెందిన సిల్వర్‌జూబ్లీ ఇండిపెండెన్సీ పార్క్‌ను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. పార్క్‌ను 1972లో ఏర్పాటుచేశారు. అన్ని రకాల మొక్కలను వేసి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి



ఎల్ఐపీ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపీ)ను ఆయన బుధవారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఎల్ఐపీ ద్వారా అందజేస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో చదవడం, రాయడం, ఏం నేర్చుకున్నారో చెప్పలేని పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించేందుకు కృషి చేయాలంటూ పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన్‌నాయుడు, కోర్సు డైరెక్టర్ బిడ్డిక భీముడు, రిసోర్స్‌పర్సన్లు పి.కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఏటీఎల్ స్కూల్‌గా పూతికవలస ఆశ్రమ పాఠశాల



అవార్డు అందుకుంటున్న ఏటీఎల్ ఇన్‌చార్జి హేమలత

సీతంపేట: జిల్లాలో ఉత్తమ అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)గా పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ఏటీఎల్ నిర్వహించే వివిధ పాఠశాలలు తనిఖీ చేసింది. ఇక్కడ ఉత్తమ రికార్డుల నిర్వహణ, విద్యార్థుల ప్రతిభ చూపడం గుర్తించారు. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమొంటోను డీఎస్ఓ లక్ష్మణరావు, ఏటీఎల్ ఇన్‌చార్జి హేమలత అందుకున్నారు. వీరిని డీఈఓ ప్రేమ్‌కుమార్ అభినందించారు.

పక్కాగా దిగుబడి లెక్క

- జిల్లాలో చురుగ్గా పంటకోత ప్రయోగాలు
- 1,768 పంటకోత ప్రయోగాలకు 189 పూర్తి
- ఎకరాకు 28-30 బస్తాలు ఫైబడి వచ్చే అవకాశం
- జిల్లాలో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం 1,68,300 ఎకరాలు
- దిగుబడి అంచనా: 3లక్షల 97వేల 980 మెట్రిక్ టన్నులు



పాలకొండ అంపిలి గ్రామంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాలకొండ రూరల్:

వరి పంట కోత దశకు వచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. మరోవైపు దిగుబడి అంచనా వేసేందుకు వ్యవసాయశాఖ పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తోంది. పక్కాగా దిగుబడిని అంచనా వేస్తోంది. పంట నష్టం జరిగిన చోట గుర్తించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటివరకు నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో ఎకరానికి 25 నుంచి 30 బస్తాల (80 కిలోలు) ధాన్యం దిగుబడి నమోదైంది. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు.

రైతన్నకు వెన్నుదన్నుగా..

ఖరీఫ్ వరి సాగుకు ఆదిలో ప్రకృతి అనుకూలించింది. ప్రభుత్వం కూడా సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రాయితీపై సమకూర్చింది. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడంతో రైతులు ఉత్సాహంగా సాగు లో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 1,68,300 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. మరి కొద్ది రోజుల్లో వరి కోతలు ముగుస్తాయి. ఈ క్రమంలో 3లక్షల 97 వేల 9800 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని పంటకోత ప్రయోగాలు చెబుతున్నాయి.



ప్రయోగం అనంతరం దిగుబడిని తూకం వేస్తున్న వ్యవసాయాధికారులు

యూనిట్లుగా విభజించి..

జిల్లా వ్యాప్తంగా పంట దిగుబడులు అంచనా వేసేందుకు వ్యవసాయ, అర్థ గణాంక శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 15 మండలాల్లో 965 గ్రామాలను ఎంపికచేసి, వాటిని 379 యూనిట్లుగా విభజించారు. ఈ గ్రామాల్లో 1,768 ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఏఓ, సహాయ గణాంక అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), ఆర్‌బీకే సిబ్బంది, బ్యాంకు సిబ్బంది బృందంగా ఏర్పడి పంట కోత ప్రయోగాలు చేపడుతున్నారు. ఇప్పటికే 186 చోట్ల పంటకోత ప్రయోగాలు పూర్తి చేశారు. ఆశించిన మేర దిగుబడులు నమోదవుతుండడంతో రైతన్నలు సంతోషపడుతున్నారు.

జిల్లాలో మండలాల వారీగా పంటకోత ప్రయోగాల వివరాలు ఇలా...

మండలం	గ్రామాల సంఖ్య	యూనిట్స్	నిర్దేశించిన పంటకోత ప్రయోగాలు
వీరఘట్టం	41	33	132
సీతంపేట	118	21	150
భామిని	22	18	72
పాలకొండ	45	34	136
కొమరాడ	99	28	136
జి.ఎల్.పురం	124	17	134
కురుపాం	95	27	138
జియ్యమ్మవలస	58	30	132
గరుగుబిల్లి	33	23	92
పార్వతీపురం	54	32	128
మక్కువ	54	31	124
సీతానగరం	44	32	128
బలిజిపేట	34	24	96
సాలూరు	90	19	112
పాచిపెంట	54	10	58
మొత్తం	965	379	1,768

దిగుబడులు ఆశాజనకం



పంటకోత ప్రయోగాలతో దిగుబడి లెక్క పక్కాగా ఉంటుంది. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. పాలకొండ మండలంలో 136 ప్రయోగాలు చేపట్టాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 14 చోట్ల ప్రయోగాలు పూర్తిచేశాం. ఎకరాకు 80 కేజీల బస్తాలు 26 నుంచి 30 వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రయోగాల ఆధారంగానే పంట నష్టపోయిన చోట రైతుకు బీమా సదుపాయం కలగనుంది.

– కె.చిన్నారావు, సహాయ గణాంకాధిరి, పాలకొండ మండలం,

అధికారుల పర్యవేక్షణలో...



జిల్లాలో 379 యూనిట్ల పరిధిలో దిగుబడి గణాంకాలను అంచనా వేసేందుకు నిర్ణయించాం. మా సిబ్బంది, వ్యవసాయాధికారులు ఈ లెక్కలను పర్యవేక్షిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ప్రయోగాలు పూర్తి అయిన క్రమంలో ఈ గణాంకాలను సంబధిత ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వీటి ఆధారంగా రైతులకు మేలు చేకూర్చేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– పి.వీరరాజు, అర్థగణాంకాధికారి, పార్వతీపురం మన్యం

గిరిజన గ్రామాల్లో పనుల జోరు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గిరిజన గ్రామాల్లో రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన గృహంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. వచ్చేనెల 15వ తేదీలోగా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో 21 బీటీ రోడ్ల పనులు పూర్తిచేసే దిశగా అధికారులు పనులు చేస్తున్నారన్నారు. సాలూరు నియోజకవర్గంలో ఐటీడీఏ ద్వారా 2019 నుంచి 2023 అక్టోబర్ 31 వరకు 532 పనులు మంజూరయ్యాయన్నారు. ఇందులో 140 పనులు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కొత్తగా 210 కి.మీ. మేర 212 మట్టి రోడ్డు పనులకు రూ.1700 లక్షలు మంజూరైనట్టు వెల్లడించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, పనులు ప్రగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పేద రైతుకు 'పట్టా'భిషేకం



పాలకొండ రూరల్: అర్హులకు శాశ్వత భూ హక్కు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులు

- 400 మంది రైతులకు 200 ఎకరాల అసైన్డ్ భూమికి పట్టాల పంపిణీ
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: అసైన్డ్ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతన్నకు ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కు కల్పిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'పట్టా'భిషేకం చేసిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పాలకొండ తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని 200 ఎకరాల అసైన్డ్ భూమిని దీర్ఘకాలంగా సేద్యం చేస్తున్న నాలుగు వందల మంది రైతులకు భూమిపై సంపూర్ణ హక్కు కల్పిస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు.

ప్రజల ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరిస్తున్నారని తెలిపారు. పేదల ఆర్థికోన్నతి కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్టు వెల్లడించారు. అందుకే ప్రజల మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికి నిండుగా ఉందన్నారు. పలు లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న నిర్ణయంతో తామంతా భూయజమానులమయ్యామని, ఈ మేలు మరువలేనిదన్నారు. కలలోకూడా ఊహించిన విధంగా అసైన్డ్ భూములకు పట్టాలు అందించడంతో ఉద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి తిరస్కారం!

భామిని: పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ వ్యాఖ్యలను జనం తిరస్కరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను విమర్శిస్తుండగా నిలదీశారు. చంద్రబాబునాయుడు 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు చేకూర్చిన సంక్షేమాన్ని చెప్పాలని ప్రశ్నించారు. దీంతో ఆయన ప్రసంగాన్ని నిలిపివేసి చల్లగా జారుకున్నారు. ఈ ఘటన భామిని మండలం దిమ్మిడిజోల కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. కాలనీలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్న జయకృష్ణ అక్కడ ఏర్పాటు చేసిన మైక్‌లో భవిషత్తుకు గ్యారెంటీ పేరున ముఖ్యమంత్రి జగనన్నపై విమర్శలు చేశారు. గ్యాస్ ధర పెంచారని, పేదలకు ఇళ్లు కట్టలేదని, కూరగాయలు ధరలు పెంచారంటూ ముఖ్యమంత్రిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండగా విందులో పాల్గొన్న ప్రజలు ఎదురుతిరిగారు. గ్యాస్ ధర పెంచినది కేంద్ర ప్రభుత్వమన్న విషయం తెలియదా అంటూ నిలదీశారు. ఇంటింటికీ రేషన్ అందిస్తున్నారని, ఇంటివద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని, పైసా అవినీతి లేకుండా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని జమ చేస్తున్నారని, పేద పిల్లలు చదువుకునే ఊరి బడులను బాగుచేశారని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని, ఇలా పథకాలన్నీ చెప్పేసరికి జయకృష్ణ నోరు మూగబోయింది. కనీస విజ్ఞత లేకుండా ధరలు పెంచినది ఎవరో కూడా తెలియక విమర్శలు చేయడంపై వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు కాగితాపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

జాతీయస్థాయి పోటీలకు కుమరాం కేజీబీవీ బాలిక



జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన లక్ష్మిని అభినందిస్తున్న ఎస్ఓ జ్యోతి

జామి: మండలంలోని కుమరాం కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కొత్తలి లక్ష్మి జాతీయస్థాయి బేస్‌బాల్ క్రీడకు ఎంపికైనట్టు పాఠశాల ఎస్ఓ బి.జ్యోతి తెలిపారు. ఈనెల 17 నుంచి 19వ తేదీవరకు వైఎస్సార్ జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-19 పోటీల్లో లక్ష్మి రాణించింది. బాలికను ఎస్ఓతో పాటు సిబ్బంది బుధవారం అభినందించారు.

వేగవంతంగా పెండింగ్ కేసుల దర్యాప్తు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: పెండింగ్ కేసుల దరాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పార్వతీపురం రూరల్ సీఐ స్వామినాయుడు, ఎస్ఐ సింహాచలంను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పార్వతీపురం రూరల్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. స్టేషన్‌లోని ఎస్‌హెచ్ఓ, రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదులు, స్టేషన్ పరిసరప్రాంతాలను పరిశీలించినారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డ్స్, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. పలు కేసుల దర్యాప్తుపై దిశానిర్దేశం చేశారు. ప్రాధాన్యత కేసులు గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్‌లలో స్టాపర్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా గ్రామాలను సందర్శించి ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. సరిహద్దు గ్రామాల నుంచి సారా తరలింపును కట్టడి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు స్వాగతం పలుకుతున్న రూరల్ సీఐ స్వామినాయుడు, ఎస్ఐ సింహాచలం

జిల్లాకు 1579 హెచ్‌బీవైసీ కిట్లు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: శిశువుల ఆరోగ్య పర్యవేక్షణలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రభుత్వం 1579 హెచ్‌బీవైసీ కిట్లను అందజేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. వీటిని జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశ కార్యకర్తలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కిట్‌లోనూ ఐదు వస్తువులు ఉంటాయని, బిడ్డ ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల పరిశీలన తెలుసుకునేందుకు ఇవి దోహదపడతాయన్నారు. ఆశ కార్యకర్తలు శిశువుల గృహాలను సందర్శించి వినియోగించే విధానాన్ని, ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. శీతాకాలంలో బిడ్డను వెచ్చగా ఉంచే విధానాన్ని తెలియజేయాలన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే వెంటనే పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వారా జిల్లా కేంద్రంలోని డీఈఐసీకి రిఫర్ చేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు వారి పరిధిలో 3, 6, 9, 12, 15 నెలల వయస్సు పిల్లల గృహ సందర్శనలు చేసి ఆరోగ్య వివరాలు ఇవ్వబడిన హెచ్‌బీవైసీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, సిబ్బంది ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీవైసీ కిట్లను ఆశ కార్యకర్తలకు అందజేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు

గర్భిణుల సేవలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు

పార్వతీపురంటౌన్: రక్తహీనత ఉన్న గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను వినియోగించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు ఆదేశించారు. జిల్లా ఆరోగ్య కార్యాలయంలో పెదబొండపల్లి, బందలుప్పి, డోకిశీల పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఆస్పత్రుల్లో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చేందుకు ఇంటి నుంచి నేరుగా ఆస్పత్రికి చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ద్వారా సికిల్ సెల్ ఎనీమియా, క్షయ వ్యాధిగ్రస్తులకు గుర్తించి మందులు అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఆర్బీఎస్కే అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ ఎమ్.వినోద్, వైద్యాధికారులు శ్రీకాంత్, ఐశ్వర్య, అనూష, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, సిబ్బంది విజయలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వేగవంతంగా పైడితల్లి ఆలయ విస్తరణ పనులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ విస్తరణ పనులు వేగవంతం చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి తెలిపారు. కార్యాలయం ఆవరణలో దేవదాయశాఖ డివిజనల్ ఇంజినీర్ కేవీఎస్.కృష్ణ, ఏఈ, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న స్థలాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామని చెప్పారు. ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు జాబితాపై అభ్యంతరాలు చెబితే శతశాతం పరిష్కరిస్తామని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణ జరుగుతోందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిని బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఓటరు జాబితాపై ఎటువంటి అనుమానాలు, సంఘటనలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈవీఎం తనిఖీలు పారదర్శకంగా జరిగాయని, ఎన్నికల కమిషన్ అధికారులు వాటిని పర్యవేక్షిస్తారన్నారు.

ఓటర్లకు అవగాహన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లో ఓటువేసే విధానంపై సంచార వాహనాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఓటరుకు పూర్తిస్థాయి అవగాహనే లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సంచార వాహనాలలో దృశ్య, శ్రవణ పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు 6,461, ఫారం-7లు 5,580, ఫారం-8లు 10,351 విచారణలో పెండింగ్‌లో ఉన్నట్టు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 20,251 ఓటర్లను చేర్చామని, 21,573 ఓటర్లను తొలగించడం, 77,018 ఓటర్ల వివరాల్లో చేర్పులు మార్పులు చేసినట్టు వెల్లడించారు.

డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడతామని కలెక్టర్ వివరించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలను డిసెంబర్ 9 వరకు స్వీకరిస్తామని చెప్పారు. డిసెంబర్ 26 నాటికి వాటిని పరిష్కరించి 2024 జనవరి 5న తుదిజాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు విధుల్లో ఉంటారన్నారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడు, పర్యవేక్షకులు డి.రవికుమార్, పార్టీ ప్రతినిధులు జి.వెంకటనాయుడు, పి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, పారిశర్ల అప్పారావు, ఎ.ప్రభాకరరావు, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారునికి ఆర్థికసాయం


గౌతమ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ విక్రమ్

విజయనగరం: జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు కె.గౌతమ్‌కు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ ఆర్థికసాయం చేశారు. డిసెంబరు 8, 9, 10వ తేదీల్లో మహారాష్ట్రలోని ముంబై ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీల్లో 61–65 కేజీల విభాగంలో గౌతమ్ పాల్గొంటుండగా, పోటీలకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని విక్రమ్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి, బంగారు పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

సూక్ష్మ మెలకువలపై అవగాహన


వెంకటరావును అభినందిస్తున్న రిజిస్ట్రార్ పల్లవి తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో విద్యార్థులకు సూక్ష్మ మెలకువలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్యాకేజీతో ఉద్యోగం పొందాలంటే పుస్తక జ్ఞానంతో పాటు ఏదైనా అంశంలో ప్రత్యేక నైపుణ్యం, సామర్థ్యం ఉండాలని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్(పబ్లిక్ స్పీకింగ్, గ్రూప్ డిస్కషన్, వృత్తి నైపుణ్యం) పై మంచి పట్టు సాధించాలన్నారు. విశాఖ గాయత్రి విద్యా పరిషత్‌కు చెందిన ప్లేస్‌మెంట్ సెల్ అధికారి వెంకటరావు స్మార్ట్ గోల్స్ అంశంపై కాసేపు మాట్లాడి, విద్యార్థులను మోటివేట్ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది సన్నీడియోల్, దేవికా రాణి తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ చర్యలతో గర్భిణుల్లో తగ్గుతున్న హైరిస్క్
- ప్రతినెలా తగ్గుతున్న కేసుల సంఖ్య
- జూన్‌లో 295 కేసులు, సెప్టెంబరులో 221 కేసులు నమోదు
- హైరిస్క్ గర్భిణులు సుఖప్రసవమయ్యేలా చర్యలు


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఆస్పత్రికి చేరుకుంటున్న గర్భిణి

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో గర్భిణుల్లో హైరిస్క్(అధిక ప్రమాదం) తగ్గుతోంది. కిశోరి బాలికల దశ నుంచి వారి ఆరోగ్యంపై జగనన్న సర్కారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నెలలో రెండుసార్లు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థులు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. వారిలో ఏవైనా వ్యాధులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన చికిత్సను అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు రక్తహీనత, పౌష్టికాహారం లోపం బారినపడకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పాటు గర్భం దాల్చిన నాటి నుంచి గర్భిణులకు అవసరమైన వైద్యతనిఖీలు, పరీక్షలు చేసి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, నిత్యం వారి ఆరోగ్యంపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంచి, వారు సుఖంగా ప్రసవమయ్యేలా చూస్తున్నారు. దీంతో మాతృమరణాలు సంభవించకుండా చూడగలుగుతున్నాం.

3 నెలల్లో తగ్గిన కేసులు..

క్రమక్రమంగా హైరిస్క్ గర్భిణుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. నెలల హైరిస్క్ కేసుల సంఖ్య ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది. జూన్‌లో 295 హైరిస్క్ కేసులు నమోదు కాగా, సెప్టెంబరు నెలాఖరు నాటికి 221కి కేసుల సంఖ్య తగ్గింది. మూడు నెలల కాలవ్యవధిలో దాదాపు 70 కేసుల వరకు హైరిస్క్ కేసుల సంఖ్య తగ్గింది.

వారం రోజుల ముందే ఆస్పత్రికి..

ప్రసవ తేదీకి వారం రోజులు ముందుగానే హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ఆస్పత్రికి తరలిస్తారు. అంతేకాకుండా జనన సంసిద్ధత ప్రణాళిక వేసుకుని మరీ సదరు గర్భిణులను సకాలంలో ఆస్పత్రిలో చేర్చుతున్నారు. ప్రసవమయ్యే వరకు ప్రతిరోజూ ఏఎన్ఎం, ఆశావర్కర్, హెల్త్ సూపర్‌వైజర్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్, పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. అలాగే వారికి అవసరమైన చికిత్స అందిస్తుంటారు. నెగిటివ్ గ్రూపు రక్తం కలిగిన వారికి నెల రోజులు ముందు నుంచే ఆ గ్రూపు రక్తాన్ని రిజర్వ్ చేసి, ఉంచుతున్నారు. హైరిస్క్ గర్భిణులకు సకాలంలో ఆస్పత్రికి చేరుకుని, వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను నడుపుతోంది. ఇప్పటికే చాలామంది వీటిని సద్వినియోగం చేసుకుని, సకాలంలో వైద్య సేవలు పొందుతున్నారు.

హైరిస్క్ అనగా..

బీపీ, సుగర్‌తో బాధపడుతున్న గర్భిణులను హైరిస్క్ గర్భిణులుగా పరిగణిస్తారు. రక్తహీనత, థైరాయిడ్, బరువు ఎక్కువగా ఉన్న వారు, ఫిట్స్, హెచ్ఐవీ, క్షయ, మొదటి కాన్పులో సిజేరియన్ అయిన గర్భిణులను సైతం హైరిస్క్ గర్భిణులుగా పరిగణిస్తారు.

ముందస్తు జాగ్రత్త చర్యలతో..



ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో గర్భిణులు హైరిస్క్ బారిన పడకుండా ఉండగలుగుతున్నారు. అంతేకాకుండా హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, ప్రతిరోజూ వారి ఆరోగ్యం పర్యవేక్షిస్తుండడంతో వారు సుఖంగా ప్రసవమవుతున్నారు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

'యాత్ర'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: పాలకొండ పట్టణంలో ఈ నెల 24వ తేదీన జరగనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇదే విషయమై స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో పార్టీ నేతలతో బుధవారం సమావేశమైన ఆయన యాత్ర విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రతీ గడపకు వివరించడమే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతీ గ్రామం నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు యాత్రకు హాజరయ్యేలా చూడాలని, పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. అలాగే గతంలో టీడీపీ హయాంలో ప్రజలకు జరిగిన మోసం, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును గ్రామగ్రామాన ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. యాత్ర బాగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైస్ ఎంపీపీ పర్రి విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు ప్రదర్శనా కేంద్రం ప్రారంభం


కూరగాయల సాగు విధానాలను కలెక్టర్‌కు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కూరగాయల సాగు ప్రదర్శనా కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడి ఎలా వస్తుందన్న విషయాలను సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. ఇదిలా ఉండగా, సాగులో ఏటీఎం మోడల్, ఇతర సాగు విధానాలను డీపీఎం ఆనందరావు కలెక్టర్ నాగలక్ష్మికి, జేసీ మయూర్‌అశోక్‌కు వివరించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించేలా..

వేపాడ: చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించేలా రైతులను చైతన్యం చేయాలని గ్రామస్థాయిలోని ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి జేసీ మయూర్ అశోక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎ.ఆనందరావు నేతృత్వంలో జరిగిన సమావేశానికి హాజరైన ఆయన ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పంటల సాగు, అధిక దిగుబడి, ఆదాయం వచ్చే మార్గాలను రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో వేపాడను మోడల్ మండలంగా ఎంపిక చేసినందున శతశాతం ప్రకృతి వ్యవసాయంతో పాటు ఎనీ టైమ్ మోడల్ సాగు రైతులు చేపట్టేలా చూడాలన్నారు. డీపీఎం ఆనందరావు మాట్లాడుతూ కె.జిపూడిలో సబల ప్రాజెక్ట్‌లో జీవ వైవిధ్య భరిత వ్యవసాయ విధానాలు, సుస్థిర భూ వనరులు, యాజమాన్య పద్ధతులపై జేసీకి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడి వస్తాయని తెలిపారు. ఈ ఏడాది 2600 ఎకరాల్లో కూరగాయల సాగు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కూర్మనాథ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయండి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్


బూర్జ గ్రామ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సీతానగరం: గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని బూర్జ, పెదభోగిలి గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయ భవనాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఏ మేర పనులు జరుగుతున్నాయి.. బిల్లుల చెల్లింపు సకాలంలో జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్మాణాల్లో జాప్యం వహించకూడదని తెలిపారు. పూర్తయిన నిర్మాణాలకు బిల్లులు పెట్టుకోవాలని, నిధుల సమస్య లేనందున బిల్లుల చెల్లింపు కూడా తక్షణమే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ, ఎంపీడీవో బి.కృష్ణమహేష్‌రెడ్డి, పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న కవితా సౌరభం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 26వ తేదీన రాయల వారి కవితా సౌరభం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆముక్త మల్యాద పద్యావలోకనం అంశంపై ప్రముఖ సాహితీవేత్త, రాజాం రచయితల వేదిక వ్యవస్థాపకుడు గార రంగనాథం ప్రసంగం ఉంటుందన్నారు. సాహితీవేత్తలు, అభిమానులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీపీటీవో

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఎస్.కోట, విజయనగరం ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలోని ప్రయాణికుల కోసం డయల్ యువర్ ఆర్టీసీ డీపీటీవో(జిల్లా ప్రజా రవాణా అధికారి) కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు డీపీటీవో సీహెచ్ అప్పలసూర్యనారాయణ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఓ గంట పాటు కొనసాగే కార్యక్రమంలో ప్రయాణికులు తమ ప్రయాణంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని అధిగమించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చన్నారు. దీనికోసం ఫోన్ నంబర్ 9959225604ను సంప్రదించాలని కోరారు.

జాతీయ హాకీ పోటీలకు రిషి


విద్యార్థి రిషిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయి హాకీ పోటీలకు స్థానిక ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థి పి.రిషి ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లిలో ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ హాకీ పోటీల్లో సదరు విద్యార్థి పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టులో సభ్యుడిగా రిషి స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ రోహినా ఖాన్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

జగన్ మామ ఇచ్చిన ట్యాబ్‌లతో..

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థిని నాగలక్ష్మి

దత్తిరాజేరు: జగన్ మామ ఇచ్చిన ట్యాబ్‌లతో విద్యార్థుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నెలకొన్నాయని తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆర్.నాగలక్ష్మి ఎంతో సంతోషంగా మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంలో తెలిపింది. ఇదే గ్రామానికి చెందిన తనకు ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు ట్యాబ్ ఇచ్చారని, దీంతో పాఠ్యాంశాలు బాగా అర్థమవ్వడమే కాకుండా విషయాలు సులువుగా గుర్తుపెట్టుకునే వీలు కలుగుతోందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు, ట్యాబ్‌లలో పొందుపరిచిన పాఠ్యాంశాలు చాలా ఉపయోగపడుతున్నాయి. విద్యార్థుల విద్యాప్రగతికి ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి, సీఎం జగన్ మామయ్యకు కృతజ్ఞతలు తెలిపింది. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థిని ఆకాంక్షించారు.

బొగ్గులారీ బోల్తా


పంటపొలంలో బోల్తాపడిన లారీ

వీరఘట్టం: మండలంలోని తూడి–రేగులపాడు సీసీపీ రోడ్డులో బుధవారం ఓ బొగ్గులారీ అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కొన్నాళ్లుగా ఇదే రోడ్డు మీదుగా వస్తున్న భారీ వాహనాలు ఏదో ఒకచోట ఇలా ప్రమాదానికి గురవుతున్నాయని పాదచారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

బాడంగి: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్లు ఎంపికైనట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ, బేస్‌బాల్ కోచ్ జి.బంగారునాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో గుంటూరు జిల్లా, వెలిగండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 బేస్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొన్న ఇరు జట్లు తృతీయ స్థానంలో నిలిచి, జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఎం.శేఖర్, సీహెచ్ మహేష్(తెర్లాం), బి.రేవతి, ఆర్.సమీరా(ఉల్లిభద్ర), ఎం.అఖిల(పారాది) ఉండగా, వీరంతా 2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

రెల్లివీధిలో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న సారాకేన్లు, ప్యాకెట్లతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రెల్లివీధిలో ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు కార్డన్ సెర్చ్ బుధవారం చేపట్టారు. సాండి చంద్ర, గండి బాబూరావు, రాజాన సుహాసిని, ఒడిశాకు చెందిన కొండగొర్రి సాంబాల దగ్గరున్న 180 లీటర్ల సారాను పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్ఐలు జె.రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో

పలువురికి గాయాలు

- వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు


పార్వతీపురం టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శోకనాథ్ గుప్తా


భామిని: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి చైతన్య

గుమ్మలక్ష్మీపురం: వేర్వేరు చోట్ల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కంబగూడ గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గొయిపాక గ్రామానికి చెందిన మీసాల రోహిత్, మీసాల నందిని ద్విచక్ర వాహనంపై కురుపాం వెళ్తుండగా, గొయిపాక వైపు ఇద్దరు వ్యక్తులతో వస్తున్న ద్విచక్ర వాహనం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నందిని కుడికాలు విరిగిపోగా, రోహిత్ కాలికి తీవ్రగాయమైంది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రులను కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. బైక్‌తో వీరిని ఢీకొన్న వారు పరారయ్యారు.

బస్సు నుంచి జారిపడి..

భామిని: బస్సు నుంచి జారిపడి విద్యార్థి పి.చైతన్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. బిల్లుమడ గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బస్సు ఎక్కుతుండగా ప్రమాదం బారినపడినట్లు తెలుస్తోంది. స్థానికుల సహకారంతో తొలుత స్థానిక పీహెచ్‌సీకి తరలించి, విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని..

పార్వతీపురంటౌన్: ట్రాక్టర్ ఢీకొన్న దుర్ఘటనలో బలిజిపేట మండలం, పనుకువలస గ్రామానికి చెందిన సంకా శోకనాథ్ గుప్తా అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం పనుకువలస సమీపంలోని పీతలబంద చెరువు వద్ద బుధవారం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సొంత పనుల నిమిత్తం పణుకువలస నుంచి బొబ్బిలికి టీవీఎస్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పీతలబంద చెరువు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పణుకువలస వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి, వైద్యసేవలు అందించారు.


గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఆస్పత్రిలో నందిని

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160